మల్టీ మోడల్ బస్టాండ్ కలేనా..!

- ముందుకు పడని అడుగులు
- పది నెలలుగా చర్యలు చేపట్టని కూటమి సర్కార్

తిరుపతి అర్బన్: తిరుపతి మల్టీ మోడల్ బస్టాండ్ నిర్మాణానికి కూటమి సర్కార్ చర్యలు తీసుకోవడం లేదు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాధాన్యత, ప్రయాణికుల అవసరాలను స్థానిక ఎంపీ గురుమూర్తి, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కేంద్రం రూ.500 కోట్లతో 13 ఎకరాల విస్తీర్ణంలో 11 అంతస్తుల భవనాలతో మల్టీ మోడల్ బస్టాండ్ నిర్మాణానికి అంగీకారం తెలిపింది. అధికారులు ఆ దిశగా డిజైన్లు కూడా చేశారు. తిరుపతి బస్టాండ్ నుంచి రోజుకు ఎంత మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. న్ని బస్సు సర్వీసులు రోజు వచ్చిపోతున్నాయి. ఆదాయం ఎంత వస్తోంది తదితర అంశాలపై నివేదిక తయారు చేశారు. గత ప్రభుత్వంలో బస్టాండ్ ప్రాంగణంలో


తిరుపతి బస్టాండ్

భూసార, భూమి పటిష్టంపై పలు పరీక్షలు కూడా నిర్వహించారు. మరోవైపు నూతన బస్టాండ్ నిర్మాణం నేపథ్యంలో ఈ బస్టాండ్‌ను తొలగించే ప్రక్రియలో భాగంగా రేణిగుంట రోడ్డు, తిరుచానూరు మార్కెట్, యూనివర్సిటీ ప్రాంతం, మంగళం ప్రాంతంలో ప్రత్యామ్నాయంగా తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత ఏడాది జూన్ నుంచి పనులు చేపట్టనున్నట్లు అధికారులు ప్రకటించారు. కూటమి సర్కార్ అధికారం లోకి రావడంతో పనులు ఆగిపోయాయి.


నూతన బస్టాండ్ మోడల్

క్లుప్తంగా

ఘనంగా మట్టల ఆదివారం


మట్టల ఆదివారంలో పాల్గొన్న క్రైస్తవులు

పాకాల: సీఎస్ఐ టౌన్ చర్చిలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. పుష్పాలు అలంకరించిన మట్టలు చేత పట్టి ఏసుక్రీస్తు పాటలు పాడుతూ ర్యాలీగా సెయింట్ పాల్స్ చర్చ్‌కు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే రోమన్ క్యాథలిక్ చర్చిలో కూడా మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆంథోనిరాజ్, సీఎస్ఐ పాస్టర్ ప్రేమ్‌కుమార్, కార్యదర్శి రాఘవేలు, ట్రెజరర్ జి.అరుళ్‌సెల్వి తదితరులు పాల్గొన్నారు.

బాబాయ్ హోటల్ ప్రారంభం


తిరుపతిలో బాబాయ్ హోటల్

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో 83 సంవత్సరాల చరిత్ర కలిగిన విజయవాడ బాబాయ్ హోటల్ రుచులు(బ్రాంచ్) ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. స్థానిక తిరుమల బైపాస్ రోడ్డు శ్రీవారి సన్నిధి ఎదురుగా బాబాయ్ హోటల్‌ను నిర్వాహకులు శనివారం ఘనంగా ప్రారంభించనున్నారు. బాబాయ్ హోటల్ కుటుంబ సభ్యుడైన వలివేటి లక్ష్మీనారాయణ శాస్త్రి, బాబాయ్ హోటల్ తిరుపతి బ్రాంచ్ కొల్లూరి చిన్నబాబు, పారాస్ జైన్ మాట్లాడుతూ ఎంతో రుచికరమైన ఆహారాన్ని కస్టమర్లకు అందించడంలో పోటీ పడడం బాబాయ్ హోటల్ ప్రత్యేకమన్నారు.

ప్రతిభ చాటిన గీతం విద్యార్థులు


టి.సాయిపూర్ణ, ఆర్.చరిత, ఎం.అక్షరసాయిశ్రీ

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని గీతం జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో జూనియర్ ఎంపీసీ విభాగంలో టి.సాయిపూర్ణ 466, ఎ.అఖిల 463, వి.మేధశ్రీ 461, బైపీసీ విభాగంలో ఎం.రమ్యశ్రీ 429, బి.గగన, ఎస్.హరీశ్వర్‌రాజు 428, సీనియర్ ఎంపీసీ విభాగంలో ఆర్.చరిత 986, బైపీసీ విభాగంలో ఈ.రాజశ్రీ 983, సీఈసీ విభాగంలో ఎం.అక్షరసాయిశ్రీ 969 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆ కళాశాల అధినేత తమ్మినేని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ బీవీ గోపినాథ్ అభినందించారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


బహుమతి ప్రదానం

తిరుపతి కల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గిరిజన నవసమాజ్ ఆధ్వర్యంలో చెన్నారెడ్డి కాలనీలోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఆదివారం విద్యార్థులకు 'అంబేడ్కర్ -విద్య గొప్పతనాన్ని తెలియజేసిన మహానుభావుడు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కై వశం చేసుకున్న నజీబ్ అహ్మద్, నితీష్, మనోజ్‌కుమార్ బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్, చంద్రనాయక్ పాల్గొన్నారు.

వాకర్స్ సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివారెడ్డి

తిరుపతి కల్చరల్: శ్రీవినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం సేవలు అందించేందుకు అసోసియేషన్ ముందుంటుందని అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివారెడ్డి, వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం రుద్రరాజు సంపూర్ణమ్మ గార్డెన్స్‌లో వాకర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వినాయక సాగర్ ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అసోసియేషన్ ఆడిట్‌ను పూర్తి చేసి రెన్యువల్ చేసి బైలాలో మార్పులు చేర్పులను సవరించాలని సభ్యులను కోరారు. అసోసియేషన్ నేతలు నిరంజన్ నాయుడు, వెంకటేశ్వర్లు రాజు, కామేశ్వరరావు, చంద్రశేఖరరావు, రామచంద్రరాజు, రమణ, బసవయ్య, శంకర్ రాజు, వీఆర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చనకు గణపతి పూజ


కలశస్థాపన, గణపతి పూజ కార్యక్రమాలు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహణ కోసం అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు ఆదివారం నుంచి మూడు రోజులపాటు అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. తదుపరి అమ్మవారి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలో కొలువుదీర్చారు. ఆపై కలశస్థాపన, గణపతి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. లక్షకుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు రూ.516 చెల్లించి పాల్గొనవచ్చునని, పసుపు-కుంకుమ, పసుపుదారం, అమ్మవారి చిత్రపటం, గాజులను అందజేస్తామన్నారు. ఆలయ ఈఓ మమత, ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: వెనుకబడిన తరగతుల ఆరాధ్యుడు బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా డీబీఆర్ రోడ్డులోని బీపీ మండల్ విగ్రహానికి ఆదివారం బీసీ సంఘర్షణ సమితి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీసీ సంఘర్షణ సమితి నేతలు లక్ష్మయ్య, రామచంద్ర యాదవ్, సెల్వరాజ్, రాజ్‌కుమార్, సుబ్బు యాదవ్, బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపినాథ్‌రెడ్డి, ప్రభాకర్ నాయుడు, కట్టమంచి చంద్రబాబు యాదవ్, విక్రమ్ స్వామి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.


బీపీ మండల్‌కు నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

అమ్మవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ దుప్పాల వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం అమ్మవారి ఆలయ ముఖ మండపంలో వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.


అమ్మవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పాల వెంకటరమణ

అన్‌అకాడమీ విద్యార్థుల విజయదుందుబి

తిరుపతి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీన విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రామచంద్రాపురం మండలం సి.రామాపురం వద్దనున్న అన్ అకాడమీ మెడ్జీ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుబి మోగించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కె.మంజునాథ్ 988మార్కులు, ఎం రెడ్డివర్ధన్ రెడ్డి 987 మార్కులు, 900 మార్కులకు పైగా 85 మంది విద్యార్థులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ద్వితీయ సంవత్సరం బైపీసీలో కె.జస్విత 980, జాతస్య 956 సాధించగా మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో బి.లక్ష్మీప్రియ470కి 464 మార్కులు, వి.చైతన్య 463 మార్కులు, ఎ.గురుజీవన్ 463 మార్కులు సాధించారు. బైపీసీలో రుతికా యాదవ్ 440కి 433, సి.మహిమ చౌదరి 433, యాషికా యాదవ్ 427, సగుప్తా 427మార్కులు సాధించగా 400 పైబడిన మార్కులతో 87మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.శేషారెడ్డి అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద సీసీ కెమెరాలు

తిరుపతి రూరల్: గాంధీపురం పంచాయతీ అవిలాల చెరువు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రెండు సీసీ కెమెరాలను ఆదివారం పోలీసులు ఏర్పాటు చేయించారు. తిరుపతి నుంచి రామచంద్రాపురం వెళ్లే మార్గంలో జాతీయ రహదారి వరకు ఎక్కడా సీసీ కెమెరాలు లేనందున నేరాలను నియంత్రించడానికి పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

తిరుమలలో రద్దీ


తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. ఎక్కడ చూసినా భక్తులు వేచిఉండడం కనిపిస్తోంది.
- తిరుమల

ఓల్డ్ వందతో తిప్పలు

తిరుపతి అర్బన్: ఓల్డ్ వందనోట్‌ను పలువురు వ్యాపారులు, బస్సు కండక్టర్లు సైతం తీసుకోవడం లేదు. దీంతో పేదోళ్లు ఆ నోట్‌ను చలామణి చేయడానికి నానా తిప్పలు పడుతున్నారు. కొందరు పాత యాభై నోట్‌ను కూడా తీసుకోవడం లేదు. ఇప్పటికీ కొందరు పాత పది రూపాయల నాణ్యాలు వద్దంటున్నారు. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఓ వైపు బ్యాంక్ అధికారులు పది రూపాయల నాణ్యం, పాత యాభై నోట్, వంద నోట్ చలామణి అవుతుందని స్పష్టంగా చెబుతున్నారు. అయినా చిరు వ్యాపారులే కాదు.. పలు మెడికల్ షాపుల్లోనూ తీసుకోవడం లేదు. ఇటీవల రిజర్వు బ్యాంక్ సూచనలతో పది రూపాయలు నాణ్యాన్ని తీసుకోకుంటే... ఎవరి నుంచి అయినా ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్లు ప్రకటించారు. దీంతో కొంత మేరకు పది రూపాయల నాణ్యాల సమస్య తప్పింది. అయితే పాత యాభై, వంద నోట్‌ను తీసుకోవడంలో సమస్యలు కొనసాగుతున్నాయి. బ్యాంక్ ఉన్నతాధికారులు ఈ రెండు నోట్లపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉందని పలువురు కోరుతున్నారు. పాత 50, 100 నోట్ల మేళా నిర్వహించి పెద్ద ఎత్తున అందరికీ అవగాహన కల్పించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.


పాత వంద నోట్

మహనీయుడు అంబేడ్కర్

తిరుపతి సిటీ: రాజ్యాంగాన్ని నిర్మించి 142కోట్ల మంది భారతీయులకు స్వేచ్ఛా జీవనాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కొనియాడారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా జాతీయ సంస్కృత వర్సిటీలో అంబేడ్కర్ దార్శనికత, సమకాలీన రాజ్యాంగ అవగాహన, సామాజిక న్యాయం అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ఆదివారం ప్రారంభించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంస్కృతాన్ని జాతీయ భాషగా అభివృద్ధి చేయాలన్న ఆయన పట్టుదల అభినందనీయమన్నారు. అడిషనల్ కోఆర్డినేటర్ రిజర్వేషన్ సెల్ చైర్‌పర్సన్, ఈసీ మెంబర్, వర్సిటీ కోర్టు సభ్యులు, డాక్టర్ జేబీ చక్రవర్తి మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తున్న భారతీయ యువతకు అంబేడ్కర్ మార్గదర్శిగా నిలిచారన్నారు. డీన్ రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ రాధా గోవింద త్రిపాఠి, ప్రొఫెసర్ పి వెంకట్రావు, ప్రొఫెసర్ సత్యనారాయణ, డాక్టర్ చందూలాల్, డాక్టర్ నల్లన్న, వై విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా రద్దు చేసినట్లు కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు సహకరించాలని కోరారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తెలిపారు .

చర్మ వ్యాధులపై నిరంతర వైద్య విద్య కార్యక్రమం

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో చర్మ వ్యాధులు, సుఖ వ్యాధులపై కళాశాల ఆవరణలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకుడు డాక్టర్ తిరుపతిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు చర్మ శాస్త్రంలో ఇటీవలి పురోగతులపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీవీఎల్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సుమలత, డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు బోధించారు. చర్మ వ్యాధి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, రాయలసీమ పరిధిలోని 10 వైద్య కళాశాలలకు చెందిన 125 విద్యార్థులు, వైద్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

వివాహ వేదికకు విశేష స్పందన

తిరుపతి కల్చరల్: రాయల బలిజ సంఘం ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పద్మావతి వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాల నుంచి 200 మందికిపైగా బలిజ కుటుంబాలు తమ పిల్లల వివాహ సంబంధాలకు హాజరయ్యారు. ఇందులో 20 మందికి వివాహ సంబంధాలు కుదిరాయని వేదిక కమిటీ అధ్యక్షుడు పి.సుబ్రమణ్యం తెలిపారు. పద్మావతి వివాహ పరిచయ వేదిక కమిటీ ఉపాధ్యక్షుడు బి.సుబ్బరామయ్య, కార్యదర్శి ఏవీ.ప్రతాప్, చెన్నూరు సుబ్రమణ్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు పి.సుబ్రమణ్యం

కారు-టిప్పరు ఢీకొని ముగ్గురికి గాయాలు

పాకాల: ఎదురెదురుగా కారు, టిప్పరు ఢీ కొన్న సంఘటన శనివారం రాత్రి సుమారు 2.30 గంటల సమయంలో చోటు చేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కల్లూరు వైపు వెళుతున్న కారు, దామలచెరువు వైపు వస్తున్న టిప్పరు మండల పరిధిలోని గుండ్లగుట్టపల్లి వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.


ప్రమాదంలో దెబ్బ తిన్న కారు

నోటీస్ బోర్డు

- జన విజ్ఞాన కేంద్రం, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మ్యాజిక్ శిక్షణ వర్క్‌షాప్.
- టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు మహతి ఆడిటోరియంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు.
- పద్మావతి పురంలోని వైఎస్ఆర్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయ్ ఇంటి వద్ద అంబేడ్కర్ జయంతి వేడుకలు. అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి సమర్పణ.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు నివాళి సమర్పణ.
- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు అంబేడ్కర్ జయంతి వేడుకలు.
- పాఠశాలల రద్దుకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు ఇందిరామైదానం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి సమర్పణ.

రాములోరి రాజసం


శ్రీరామచంద్రమూర్తి ఊంజల్ సేవ

చంద్రగిరి: శ్రీకోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. తదుపరి సాయంత్రం శ్రీరామచంద్రమూర్తి శ్రీమన్నారాయణుడి ఆలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం చల్లని సాయంత్రపు వేళలో స్వామివారికి ఊంజల్ సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గాత్ర కచ్చేరి ఆకట్టుకుంది.

ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను కూటమి సర్కారు చెల్లించకుండా విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఎస్వీయూ వైఎస్ఆర్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మనం ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పది నెలల పాలనా కాలంలో విద్యార్థులకు ఫీజులు రాక ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని మండి పడ్డారు. విద్యార్థుల్ని కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతుంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిద్ర పోతున్నారా అని ప్రశ్నించారు. కూటమి చర్యలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు బకాయిల్ని తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల కోసం విద్యార్థుల్ని వేధించే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.